ప్రజాశక్తి
గురువారం 17 నవంబరు 2022
5
శ్రీకాకుళం

సృజనాత్మకతకు ఫెస్ట్‌లు దోహదం

ఎచ్చెర్ల: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఫెస్ట్‌లు దోహదపడతాయని ఆర్‌జెడి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కుశాలపురం పరిధిలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే పాలిటెక్ ఫెస్ట్‌ను బుధవారం ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను అందుకోవాలన్నారు. విద్యకు సాంకేతికతను జోడిస్తే ఉన్నత శిఖరాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. ఫెస్ట్‌లో ప్రాజెక్టులు ప్రదర్శించి ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.25 వేలు, ద్వితీయ స్థానంలో ఉన్న వారికి రూ.పది వేలు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు విజయవాడ కేంద్రంగా ఫెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రస్థాయి ఫెస్ట్‌లో ప్రథమ స్థానం పొందిన వారికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.50 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు అందిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జానకిరామయ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్‌లకు సంబంధించి 74 ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు తెలిపారు.

సర్వేయర్లు ఉక్కిరిబిక్కిరి

జిల్లాలో భూ సమగ్ర సర్వే నిరంతరాయంగా సాగుతోంది. ఆ విషయంలో రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారు. ఈ అంశం అభినందించదగ్గ విషయమే. రాష్ట్రంలో మనమే ముందుండాలన్న అధికారుల ఆకాంక్ష మంచిదే. వేగంగా లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో వారు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రక్రియలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న సచివాలయ సర్వేయర్లు రాత్రనక పగలనక పనిచేస్తున్నారు. సెలవుల్లోనూ పనిచేస్తూ పని భారంతో అనారోగ్యం పాలవుతున్నారు.

- భూ సమగ్ర సర్వేపై ఉరుకులు పరుగులు
- ఒత్తిడిలో సచివాలయ సర్వేయర్లు
- అనారోగ్యం పాలవుతున్న ఉద్యోగులు
- సర్వే సమగ్రతపై ఒత్తిడి ప్రభావం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి

కవిటి మండలం వరక గ్రామంలో చేపడుతున్న భూ సర్వే

జిల్లాలో 1,466 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. భూ సమగ్ర సర్వే కింద జిల్లాలో 9,86,092 ఎకరాలను సర్వే చేయాల్సి ఉంది. ఇందులో తొలి విడత కింద 350 రెవెన్యూ గ్రామాల్లో 1,40,775 ఎకరాలను సర్వే చేశారు. రెవెన్యూ గ్రామాల పరిధిలోని 528 గ్రామాలకు సంబంధించి ఇమేజ్‌ల అప్‌లోడ్ పూర్తి చేశారు. ఇంకా 178 గ్రామాల ఇమేజ్‌లను తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఒకవైపు సర్వే చేస్తూనే మరోపక్క సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. 1466 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసేందుకు ప్రభుత్వం వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. ప్రస్తుతం ఇదే సర్వేయర్లకు కఠిన పరీక్షగా మారింది. మార్చి 30వ తేదీలోగా డ్రోన్ సర్వే పూర్తి చేయాలని నిర్దేశించారు.

పనిభారంతో సతమతం

సమగ్ర భూ సర్వేలో సచివాలయ సర్వేయర్లు తీవ్ర ఒత్తిడిలో ఉంటున్నారు. సిబ్బందికి పూర్తిగా అనుభవం లేకపోవడం, చేస్తున్న పని పూర్తి సక్రమంగా చేయాలనే నిబద్ధత, పై అధికారుల ఒత్తిడి వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రోజుకు 24 గంటలూ పనిచేస్తున్నా కనీసం ఆదివారం కూడా సెలవు ఇవ్వకపోవడంతో మానసిక, శారీరక సమస్యలతో సతమతమవుతున్నారు. అత్యవసరమైతే గానీ సెలవులు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో అనారోగ్యం, అభద్రతాభావంతో ముగ్గురు సచివాలయ సర్వేయర్లు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు నమోదవుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. పనిఒత్తిడి నుంచి కొంతమేర ఉపశమనం కలిగించాలని వారు కోరుతున్నారు.

రెవెన్యూ సిబ్బందికీ అదే ఇబ్బంది

సమగ్ర భూ సర్వేపై ప్రతిరోజూ ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర టెలీ కాన్ఫరెన్స్‌తో మండల స్థాయి అధికారులకు సగానికి పైగా సమయం వృథా అవుతోంది. గ్రామస్థాయిలో విఆర్‌ఎ, విఆర్‌ఒ, గ్రామ రెవెన్యూ సర్వేయర్లను స్థానిక తహశీల్దార్లు సమన్వయం చేసుకుంటూ తమ తమ మండలాల్లో భూ సర్వేను పరుగులు పెట్టిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ రెవెన్యూ గ్రామంలో ఆరోజు ఏం చేయాలి, ఇంతవరకు అక్కడ ఏం చేశారని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. రోజులో సగ భాగం మండల స్థాయి రెవెన్యూ అధికారులకు దీనికి కేటాయించడానికే సరిపోతోంది. దీంతో వారు మిగతా కార్యక్రమాలపై దృష్టి సారించలేకపోతున్నారు.

సర్వేలో పొట్లు

సర్వే ప్రక్రియలో కీలకంగా ఉన్న రోవర్స్ జిల్లాలో తగినన్ని లేవని తెలుస్తోంది. ఉదాహరణకు కవిటి మండలంలో సర్వే చేయడానికి సుమారు ఐదు రోవర్లు కావాల్సి ఉండగా, మూడు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సర్వే పూర్తి చేయాలంటే మండలంలో ఉన్న సిబ్బంది సరిపోవడం లేదు. బయట ప్రాంతం నుంచి అదనపు బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వారికి అక్కడ పరిస్థితి తెలియకపోవడం, సరైన సహకారం లేకపోవడంతో సర్వేలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదాహరణకు ఒక రైతుకి సంబంధించి ఒక రెవెన్యూ గ్రామంలో ఎన్ని సర్వే నంబర్లు ఉన్నా ఖాతా నంబరు ఒకటే ఉండాలి. కానీ పైన పేర్కొన్న సమస్యతో ఒక్కో సర్వే నంబరుకు ఒక్కో ఖాతా నంబరు వచ్చేసింది. దీంతో మళ్లీ మొత్తం సరిచూసుకోవాల్సి వస్తోంది.

సర్వేపై పని ఒత్తిడి ప్రభావం

ఉరుకులు పరుగులు మీద సర్వే చేయడంతో చాలా చోట్ల తప్పులు దొర్లుతున్నాయి. కవిటి గ్రామానికి చెందిన బెందాళం వేణుకు 52 సెంట్ల భూమి ఉంటే, సర్వేలో 48 సెంట్లు ఉన్నట్లు వచ్చింది. ఆన్‌లైన్‌లో 44 సెంట్లు ఎంటర్ చేశారు. బూర్జ మండలం మదనాపురానికి చెందిన ఓ రైతుకు 1.80 సెంట్ల భూమి ఉండగా 90 సెంట్లు భూమి ఉన్నట్లు వచ్చింది. దీంతో ఆ రైతు తన భూమి వివరాలను సరిచేయాలంటూ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.

ఇపిఎస్ పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ధర్నా చేస్తున్న ఇపిఎస్ పెన్షనర్లు

ఇపిఎస్ పెన్షన్‌ను రూ.తొమ్మిది వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన పెన్షనర్లు నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, ఎం.ఆదినారాయణ మూర్తి మాట్లాడుతూ అతి తక్కువ పెన్షన్‌తో ఇపిఎస్ పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి వస్తున్న అతి తక్కువ పెన్షన్‌తో పెన్షనర్లకు వాటిల్లుతున్న అన్యాయానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పెన్షనర్లకు సుప్రీంకోర్టు తీర్పు వల్ల పరిమిత ప్రయోజనం మాత్రమే కలుగుతుందన్నారు. 2014 సెప్టెంబరు ముందు 11(3) కింద రిటైరైన ఉద్యోగి, యజమాని జాయింట్ ఆప్షన్ ఇవ్వకపోతే పెన్షన్ పెంపుదల ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

ఇపిఎస్ పెన్షన్ వస్తున్న కారణంగా అంతకంటే ఎక్కువ వచ్చే రాష్ట్ర ప్రభుత్వ వృద్ధాప్య పెన్షన్‌నూ ఇవ్వడం లేదన్నారు. పెన్షన్ పొందడానికి 12 నెలలు బదులు 60 నెలలను పరిగణనలోకి తీసుకోవడం వల్ల అర్హత జీతం తగ్గి పెన్షన్ తగ్గుతుందని చెప్పారు. ఇపిఎస్ పెన్షనర్లకు కరువుభత్యం లేకపోవడం వల్ల జీవితాంతం అదే పెన్షన్ మొత్తం కొనసాగుతోందని తెలిపారు. పెరుగుతున్న ధరల కారణంగా ఏళ్లు గడుస్తున్న కొద్దీ నిజ పెన్షన్ మొత్తం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు, కరువు భత్యం చెల్లించాలని అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. కనీసం రూ.మూడు వేలు కరువుభత్యం ఇవ్వాలన్న కోషియార్ కమిటీ నివేదికను అమలు చేయడం లేదన్నారు. హై పవర్ కమిటీ ఇచ్చిన నివేదికలను బహిర్గతం చేయకుండా ప్రభుత్వాలు తొక్కిపెడుతున్నాయన్నారు. కనీస పెన్షన్ రూ.రెండు వేలు ఇవ్వాలన్న పార్లమెంటరీ కమిటీ నివేదికనూ ప్రక్కన పెట్టేశారన్నారు. 2004 తర్వాత నియమించిన ఉద్యోగులు సిపిఎస్ పరిధిలోకి రావడం వల్ల భవిష్యత్‌లో పెన్షన్ భారం తగ్గుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ఇపిఎస్ పెన్షన్ స్కీమ్‌లోని లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఇపిఎస్ పెన్షనర్లకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి పి.సుధాకరరావు, కమిటీ సభ్యులు పి.నరసింహ రావు, ఎల్.అనంతరావు, పి.నీలకంఠేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, డి.రాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో రహదారుల నిర్మాణానికి ఇప్పటివరకు రూ.24 కోట్ల అంచనాలతో 21 పనులు మంజూరయ్యాయని, పనులు అసంపూర్తిగా ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. విధుల్లో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహిస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన యూరో కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులను చేపట్టిందని సంబంధిత కాంట్రాక్టరు సహకరించకపోవడం వల్లే పనులు జాప్యమయ్యాయని అధికారులు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణాలపై జాప్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి పనుల్లో అధికారులు భాగస్వాములు కావాల్సిందేనని స్పష్టం చేశారు. కొన్నిచోట్ల కల్వర్టులను పూర్తి చేసి మిగిలిన పనులను కొనసాగించడంలో కాంట్రాక్టర్ ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ఆమదాలవలస మండలంలోని గొల్లపేట, హనుమంతపురం, బొమ్మిడాలపేట, నెల్లిమెట్ట, ఇసుకలపేట, సిరిసింపేట, దివంజిపేటలో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. సరుబుజ్జిలి మండలంలోని కొండవలస, బురిడివలస, షళంత్రి, అమృత లింగానగరం, బప్పడాంలో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పొందూరు మండలంలోని లచ్చయ్యపేట, అచ్చిపోలవలస, ఇల్లయ్యగారిపేట, నరసాపురం, కిల్లారిపేట, ఎరుకులపేట, భగవాన్‌దాస్‌పురం, రామదాసుపేట, రంగనాథపేటలో పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నాయని చెప్పారు. బూర్జ మండలం ఎబిసిపేటలో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాను పర్యటించిన నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో 53 పనులను ప్రతిపాదించామని, ఇప్పటివరకు పనులు ఎందుకు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. నిర్లక్ష్యాన్ని వీడి త్వరితగతిన పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.ఎస్.ఎన్ మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గిరిధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, సూర్యప్రకాష్, నాలుగు మండలాల ఇంజినీరింగ్ అధికారులు సత్యనారాయణ, మణికుమార్, జ్యోతిలక్ష్మి, ఫల్గుణరావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

30న వ్య.కా.స జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 17వ జిల్లా మహాసభలు ఈనెల 30వ తేదీన శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, జి.సింహాచలం తెలిపారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల సంఘ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్‌శక్తులకు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. 1934లో పుచ్చలపల్లి సుందరయ్య వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని, నాటి నుంచి వ్యవసాయ కూలీలు, కర్షకులు, కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటాలు సాగిస్తోందన్నారు. గత మూడేళ్ల కాలంలో జిల్లాలోని భూ సమస్యలు, ఉపాధి హామీ, వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు తదితర పోరాటాలు చేపట్టినట్లు వివరించారు. ఈనెల 30న నిర్వహించే సంఘ జిల్లా మహాసభలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 300 మంది రైతు, వ్యవసాయ కార్మికులు, కార్మిక ప్రతినిధులు, ఆహ్వానితులు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు భాస్కరరావు, నారాయణరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణ బాధ్యత వైద్యులదే

- కార్పొరేట్ తరహాలో ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు
- హై రిస్క్ కేసులను గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మాతా శిశు మరణాల నివారణకు పూర్తి బాధ్యత వైద్యులదేనని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. మాతా శిశు మరణాల నివారణ, ఇతర అంశాలపై వైద్యాధికారులు, పిహెచ్‌సి వైద్యులు, సిబ్బందితో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. జిల్లాలో మాతా శిశు మరణాల నివారణకు వైద్యులు అంకితభావంతో పనిచేయాలన్నారు. వైద్యులు నిర్లక్ష్యంగా ఉంటే ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మరణాలు సంభవిస్తున్నాయనే భావన ప్రజల్లో రాకూడదని చెప్పారు. ముందస్తుగా ఆస్పత్రిలో చేరి ఎక్కువ రోజులు చికిత్స పొందుతున్నా మాతా శిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయని ప్రశ్నించారు. ఆ సమయంలో ఎవరి వల్ల నిర్లక్ష్యం ఉన్నా తల్లీ బిడ్డ కోల్పోవాల్సి వస్తుందన్నారు. అందువల్ల గర్భిణులు, బాలింతల స్థితిగతులకు అనుగుణంగా క్రమం తప్పకుండా వైద్యం అందించాలని చెప్పారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రభుత్వాస్పత్రులకు పంపించడం అలవాటుగా మార్చాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, శిశు మరణాలకు కారణమైన వ్యాధులు రాకుండా ఉండేందుకు అవసరమైన వ్యాక్సిన్లు సకాలంలో వేసి మరణాలను నివారించాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని, అందించే వైద్యంపై గర్భిణులు, ప్రజలకు నమ్మకం కల్పించాలన్నారు. కాన్పు తర్వాత అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు ఇళ్లను సందర్శించి గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా గమనించాలన్నారు. హై రిస్క్ కేసులను ముందుగా గుర్తించి సాధ్యమైనంత మేరకు ప్రాణాలు కాపాడేందుకు తగిన సూచనలు అందించాలన్నారు. రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్ వంటి అంశాలను విధిగా పరిశీలించాలని, ప్రతి కేసును క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ద్వారా మరణాలు ఆపగలమన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి జె.భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్.వి.ఎస్ కుమార్, ఉప వైద్యారోగ్యశాఖ అధికారి లక్ష్మీతులసి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గైనికాలజిస్ట్ పార్వతి, 11 పిహెచ్‌సిలకు చెందిన వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విధి నిర్వహణలో ఉదాసీనంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి చిట్టిరాజు హెచ్చరించారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో ప్రణాళిక, నిర్వహణపై జిల్లాలోని 30 మండలాల టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అరుదైన అవకాశం ఉందని, అందువల్ల ప్రతిఒక్కరూ ఇష్టంగా విధులు నిర్వహించి జిల్లాలో ఉపాధి హామీని అగ్రస్థానంలో నిలపాలన్నారు. జిల్లావ్యాప్తంగా సగటు కూలి రూ.250 వచ్చే విధంగా కూలీలతో పని చేయించాలని టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకుని ఆయా పంచాయతీల్లో కూలీలకు ఉపాధి కొరత లేకుండా ఉండేందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్లాంటేషన్ పనుల్లో భాగంగా చేపట్టిన మొక్కల పెంపకంలో పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను తొందరలో నాటాలన్నారు. ఈనెల 22, 23వ తేదీల్లో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ జిల్లాకు రానున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, గ్రామ పంచాయతీ స్థాయిలో అన్నిరకాల పనులు పూర్తి చేయడంతో పాటు జాబ్ కార్డులు అప్డేట్ చేయాలన్నారు. ప్రత్యేక తనిఖీ బృందాలు జిల్లాకు వచ్చిన సమయంలో సిబ్బంది పూర్తిస్థాయి సన్నద్ధతతో ఉండాలన్నారు. సకాలంలో కూలి డబ్బులు అందేలా చూడాల్సిన బాధ్యత కంప్యూటర్ ఆపరేటర్లదేనని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం జిల్లాలోని 912 పంచాయతీల పరిధిలో రాజ్గోర్ దివాస్ సమావేశాలను నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ఎనిమిది వేల పైచిలుకు మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మండల స్థాయిలో ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలియజేశారు. ఉపాధి చూపించక ఏ ప్రాంతంనుండైనా వలసలు వెళ్లినట్లయితే సంబంధిత మండల సిబ్బందిపై కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. 95 రకాల పనులు ఉపాధి హామీ పథకంలో చేపట్టవచ్చునని కేవలం చెరువులు, కాలువల్లో పూడికతీత పనులుపైనే ఆధారపడకుండా అన్ని రకాల పనులు క్షేత్రస్థాయిలో చేయాలని నిర్దేశించారు.

ఫైనాన్స్ మేనేజర్ స్వరూప రాణి మాట్లాడుతూ పంచాయతీల ఎకౌంట్లో ఉన్న నేమ్ బోర్డు ఇతర పనులకు సంబంధించిన విధుల వివరాలు తక్షణం తెలియజేయాలన్నారు. సామాజిక తనిఖీ రికవరీలపై ప్రతినెల కమిషనర్ కార్యాలయం నుంచి వివరాలు కోరుకున్నందున మండల స్థాయిలో రికవరీలపై దృష్టిసారించి వాటిని వసూలు చేయాలని కోరారు. సమావేశంలో కార్యక్రమ అధికారి కె.వి అప్పలనాయుడు, ఎపిడిలు జి.హరిత, మురళీకృష్ణ, అమ్మినాయుడు, రవి, యుగంధర్, శైలజ, సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఎం.రవికుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టేడియం పునర్నిర్మాణంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

జిల్లాలో ఎంతోమంది క్రీడాకారులను అంతర్జాతీయ, జాతీయ స్థాయికి చేర్చిన కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణంలో వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని టిడిపి నాయకులు గొండు శంకర్ విమర్శించారు. స్టేడియం పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద బుధవారం టిడిపి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. నిలిచిన స్టేడియం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో క్రీడలకు నిలయంగా ఉండే కోడి రామ్మూర్తి సేడియం నిర్మాణం పనులు గత టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టినట్లు తెలిపారు. శాప్ ఆధ్వర్యాన నిధుల విడుదల, ఇతర సాంకేతికపరమైన ఇబ్బందుల వల్ల పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని చెప్పారు. పనులు కొనసాగుతున్న సమయంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో స్టేడియం నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఈ స్టేడియంలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్టేడియం నిర్మాణానికి నిధులు ఇస్తున్నట్లు ప్రకటించినా ఇంతవరకు అతీగతి లేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గత ఎన్నికల ముందు స్టేడియం పూర్తి చేస్తామని హామీనిచ్చారని, ఇప్పుడు ఆ ఊసెత్తడం లేదన్నారు. తక్షణమే పనులు చేపట్టి ప్రతిష్టాత్మకమైన కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.వి రమణ, దొండపాటి నవీన్, అబ్దుల్ షాజహాన్, బాషా, రెడ్డి శంకర్, జి.కమలనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి పిలుపునిచ్చారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద జానపద కళా బృందాల ప్రదర్శనను జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి నాటకాల ద్వారా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో కళా బృందం 25 ప్రదర్శనలు చొప్పున రెండు బృందాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ బృందాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి, లెప్రసీ, రక్తదానం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యపరుస్తాయని చెప్పారు. బృందాలకు కరపత్రాలు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంరిది పాల్గొన్నారు.

18, 19న జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన ఈనెల 18, 19 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. క్రీడా సంబరాల బ్రోచర్‌ను డిఎస్‌డిఒ ఎం.మాధురితో కలిసి కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయి, జోనల్ స్థాయి, రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడల్లో ప్రైజ్‌మనీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లో నమోదై ఉండాలని స్పష్టం చేశారు.

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్

ప్రజాశక్తి - కవిటి

'సిపిఎస్ ఇంటికి యుటిఎఫ్'లో పాల్గొన్న నాయకులు

ఎట్టి పరిస్థితుల్లోనూ సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందేనని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ అన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ చేపట్టిన 'సిపిఎస్ ఇంటికి యుటిఎఫ్' అనే కార్యక్రమం బుధవారం కవిటి యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసిపి ఇప్పుడు మాటమార్చి తిరిగి ఉపాధ్యాయులపైనే బైండోవర్ కేసులు నమోదు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఒపిఎస్ మాత్రమే ఉండాలని డిమాండ్ చేశారు. ప్రతి సిపిఎస్ ఉద్యోగి ఇంటిని సందర్శించి, వారి కుటుంబ సభ్యులను పోరాటంలో భాగస్వామ్యం చేస్తామని ఆయన తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి తక్షణమే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేదంటే పోరాటం ఉధతం చేసి, సిపిఎస్ రద్దు చేసేవరకు అవిశ్రాంతంగా శ్రమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు ఎల్ బాబురావు, యుటిఎఫ్ కవిటి మండల ప్రధాన కార్యదర్శి మురళీ ప్రకాష్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు సింహాచలం, జగదీష్, జానకిరావు, జిల్లా సభ్యులు కుర్మారావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ భవిత

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

వివేకానంద చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కృష్ణదాస్ తదితరులు

దేశ భవిష్యత్ యువత పైనే ఆధారపడి ఉందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మునసబుపేటలో గల గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని యువతకు పిలుపునిచ్చారు. యువజనోత్సవాల్లో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను కనబరుచుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. పట్టుదలతో దేన్నైనా సాధించవచ్చని చెప్పారు. యువజనోత్సవాల్లో సాంస్కృతిక పోటీలు 15 నుంచి 29 ఏళ్ల యువతీ యువకులకు 32 అంశాలపై పలురంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా కళలు, క్రీడలకు ఎంతో ప్రాచుర్యం ఉందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. విద్యార్థులందరూ యువజనోత్సవాల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయి ఎంపికలో పాల్గొనడానికి చక్కని అవకాశమని తెలిపారు. క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయన్నారు. ఎంపిపి అంబటి నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళారంగాల్లో ముందుండాలన్నారు. సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు మాట్లాడుతూ పలు రంగాల్లో ప్రతిభ గల కళాకారులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు.

తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు రంగాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. సమావేశంలో మెప్మా పీడీ కిరణ్ కుమార్, యూత్ కోఆర్డినేటర్ ఉజ్వల్, సెట్‌శ్రీ మేనేజర్ వి.వి అప్పలనాయుడు, గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఇంటాక్ అధ్యక్షులు రాధాకృష్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT PALASA
O.S. 106 /2021

Between:- The State Bank of India, Main Branch Palasa,Rept. by its **Chief Manager**
…Plaintiff.

And : Tangudu Sesha Giri Rao,s/o Ramanayya, Proprietor M/s Satyavathi Whole Sale Mart,Kasibugga.
.... Defendant

To, Tangudu Sesha Giri Rao, s/o Ramanayya, Proprietor M/s Satyavathi Whole Sale Mart r/o door No.19-2-173/2, Kotha Veedi Palasa, Srikakulam district.

Whereas the above named plaintiff has instituted a suit against you for recovery of the suit claim. You are hereby summoned to appear before the above court in person or by an advocate duly instructed and able to answer all material questions relating to the suit, on the day of **30-11-2022** at **10.30 a.m.**in the fore noon to answer the claim.Take notice that in default of your appearance on the day and hour above mentioned, the suit will be heard and determined in your absence (ex-parte).

By order of the court.

N.Visweswar Rao,
Advocate, Talabhadra.

మాట్లాడుతున్న ఆర్‌జెడి జ్యోతి కుమారి

కళాశాలలో విద్యార్థులను చేర్పించాలి

ఆర్‌జెడి జ్యోతి కుమారి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ మహిళా కళాశాల మంజూరు చేసిందని, కళాశాలలో పిల్లలను చేర్పించాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతి కుమారి అధికారులు ఆదేశించారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం ఆమె అకస్మాతుగా సందర్శించారు. కళాశాల మంజూరైనా పిల్లలను ఎందుకు చేర్పించలేదని ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను ప్రశ్నించారు. బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలకు మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులను చేర్పించేందుకు త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు పాఠశాలకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో పర్యటించి విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఇదే కళాశాలలో చేర్పించే బాధ్యత వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ ఉన్నత పాఠశాల ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నత స్థానంలో ఉన్నారని, ఆ దిశగా విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు పేరు తెచ్చి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పలాస ఎమ్మార్సీని సందర్శించారు. జగనన్న విద్యా కానుక ఎంతమంది పిల్లలకు అందించారని, బడిబయట పిల్లలను ఎంతమందిని గుర్తించారు, ఎంతమంది పిల్లలు చేర్పించారు, పాఠ్య పుస్తకాలను ఎంతమంది విద్యార్థులకు అందజేశారు, తదితర వివరాలను విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డిఇఒ జి.పగడాలమ్మ, పలాస ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, హెచ్‌ఎం కె.వైకుంఠరావు, పలాస ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పి.బాలరాజు, శివకుమార్, తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

20న పినకాన వర్థంతి సభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కామ్రేడ్ పినకాన కృష్ణమూర్తి ఆరోవ వర్థంతి సభ ఈ నెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు మెళియాపుట్టి రోడ్డు, చినలక్ష్మిపురంలో స్థూపం వద్ద నిర్వహిస్తున్నట్లు సిపిఎం టెక్కలి మండల కమిటీ తెలిపింది. ఈ సభకు ముఖ్య వక్తలుగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.మోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ప్రసాదరావు, సీనియరు పాత్రికేయులు సత్తారు భాస్కరరావు, తదితరులు విచ్చేయనున్నట్లు పేర్కొంది. నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన జరిగే సభకు కుటుంబసభ్యులు, బంధువులు, అభిమానులు, సిపిఎం నాయకులు హాజరవ్వాలని కోరింది.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రంథాలయాల ఏర్పాటుకు ఉద్యమించిన స్వాతంత్ర్య సమర యోధులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, కాశీరాజు నాగేశ్వరావు, మాడపాటి హనుమంతరావు, పాతురి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య, రంగనాథన్ వంటి వారు చిరస్మరణీయులని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన వారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారుల చిత్ర పటాలకు పూలమాలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమ రచనలను, పత్రికలను ప్రజలకు చేరువ చేసేందుకు గ్రంథాలయాలు వేదికగా పని చేశాయన్నారు. పోటీ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు సువర్ణావకాశమన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, సువ్వారి సత్యనారాయణ, కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు పాల్గొనారు. అనంతరం కమిషనర్‌ను సన్మానించారు.

పొందూరు: పొందూరు శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా ఆధ్వర్యాన ఉద్యమ కారులకు నివాళ్లర్పించారు. కార్యక్రమం విశ్రాంత ఉపాధ్యాయులు కాళ్లకూరి శాంతారాం, ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్, ఇందిరాదేవి, అధ్యాపకులు మురళి, వెంకటరావు పాల్గొన్నారు.

రణస్థలం : రణస్థలం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.హరినాథరావు, వై.ప్రకాష్‌బాబు, ఎస్.జె.జగన్నాథరాజు, ఆర్.రాంప్రసాద్, సిఆర్‌పి రామకృష్ణ పాల్గొన్నారు.

జి.సిగడాం : జి.సిగడాం మండలం శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వై.అమర్నాథ్ ఆధ్వర్యాన గ్రంథాలయ పితామహులను స్మరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, జయ, స్వపన, ఈశ్వరరావు, లక్ష్మణరావు, సిబ్బంది దుర్గారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాట్లాడే బొమ్మ

లావేరు : మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాలు సందర్భంగా బుధవారం మిమిక్రీ శ్రీనివాస్ మాట్లాడే బొమ్మ ప్రదర్శన చేశారు. చిన్నారులు మాట్లాడే బొమ్మతో మాట్లాడారు. అలాగే గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా వారం రోజులు చేసే కార్యక్రమాలు గురించి బొమ్మతో మాట్లాడించారు. చిన్నారులు మాట్లాడే బొమ్మ ప్రదర్శన ఇవ్వడం ఆనందపడ్డారు. తొలుత గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణరావు, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.అరుణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మిమిక్రీ శ్రీనివాస్‌కు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, హెచ్‌ఎం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, పాఠకులు పాల్గొన్నారు.

లావేరు శాఖాగ్రంథాలయంలో హైస్కూల్ విద్యార్థులకు రామాయణ, మహాభారతాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు ఎస్.ఆర్.రంగనాథన్ పాతూరి నాగభూషణం అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

ఆమదాలవలస : స్థానిక శాఖాగ్రంథాలయంలో దిశా చట్టం - మహిళా సాధికారత అనే అంశంపై వ్యాసరచన పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలో పది హైస్కూళ్ల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ : విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో విలువైనదని ఓ.వి.పేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలల లైబ్రరీలో గ్రంథాలయ ఉద్యమకారులు జీవితాలను వివరించారు. కార్యక్రమంలో లైబ్రరీయన్ కె.వి.వెంకటరత్నం, చింతల కృష్ణారావు, లెక్టరర్లు రాజశేఖర్, మేక, శివప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయాధికారి టి.ఇందిర చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

కవిటి: ఎందరో త్యాగధనుల ఫలితమే నేటి మన స్వాతంత్ర్యమని బి.జానకిరావు, లింగరాజు ప్రసాద్ పట్నాయక్ అన్నారు. 55వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్వాతంత్ర్య సమర యోధులు, గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్‌ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పోతూరి నాగభూషణం తదితరులు చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులకు పత్రికా పఠన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పూర్ణచంద్ర బెహరా, ఉపాధ్యాయులు ఆర్.మహేష్, ఎ.వెంకటేశ్వరరావు, డి.రాము, స్థానికులు ఆర్.దొంబురు, టి.ధర్మసాహు, బి.గోపాల్, వై.భారత్, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరామయ్య, దాడిచర్ల హరి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, రంగనాథ్, వి.గోపాలకృష్ణయ్య, తదితరుల చిత్ర పటాలకు విశ్రాంత గ్రంథాలయాధికారి టి.వైకుంఠరావు నివాళులర్పించారు. వారు గ్రంథాలయ అభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.భారతి, గ్రంథ పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పూర్ణచంద్ర బెహరా అధ్వర్యంలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఢిల్లేష్ వ్యవహరించారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న అయ్యంకి, రంగరాజన్, పాతూరి వంటి వారి సేవలను అధ్యాపకులు వాసుదేవరావు వివరించారు. కార్యక్రమంలో పి.నారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

నౌపడ: 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నౌపడ శాఖ గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దాశరథి, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ మాట్లాడుతూ వారి కృషి ఫలితమే గ్రంథాలయ వ్యవస్థ బలపడిందని విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : కమిషనర్‌ను సత్కరిస్తున్న సువర్ణ

పలాస: గ్రంథాలయాలను సద్వినియోగించుకొని నిరుద్యోగులు ఉద్యోగాలు పొందాలని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ అన్నారు. కాశీబుగ్గశాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమకారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.రాంబాబు, డి.మంగపతి, హేమంత్ సింహాచలం, సుజాత, నాని బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : శాఖా గ్రంథాలయంలో పాఠకులకు మౌలిక వసతులు కల్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని సర్పంచ్ మజ్జి రమణమ్మ సూచించారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి కె.మానస ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ ప్రముఖుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మినారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, ఎన్.వల్లంనాయుడు, సరోజని, సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: గ్రంథాలయాలు ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వీలుంటుందని, అటువంటి గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ చంద్రకుమారి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ పితామహులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, అనురాధ, వేణు, వెంకటరావు, స్వాతి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

లావేరు : బొమ్మ ప్రదర్శన చేస్తున్న మిమిక్రీ శ్రీనివాస్

కవిటి : పేపరును చదువుతున్న చిన్నారి

నౌపడ : చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులకు బుధవారం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారులు శ్రీధర్, సూర్యకుమారి, ప్రియాంకలు దోమపోటు నివారణ, రబీలో ఆరుతడి పంటల సాగు వంటి అంశాలపై గ్రామ సహాయకులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల సాగుపై రైతులు దష్టి సారించేలా సిబ్బంది కషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీదేవి, బి.ధనుంజయ, సిబ్బంది డి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే వేగవంతం

జాయింట్ కలెక్టర్ నవీన్

పోలాకి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేలో భాగంగా గ్రామానికి చెందిన గ్రామ కంఠం భూముల సర్వే వేగవంతం చేయాలని జెసి నవీన్‌కుమార్ అధికారులను ఆదేశించారు బుధవారం సంతలక్ష్మీపురం పంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాలు, యజమానుల హక్కుపత్రాలు పరిశీలించి నిర్దారణ చేయాలని సూచించారు. గ్రామకంఠ భూములు సర్వేలో సంతలక్ష్మీపురం పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవడం జరిగిందని, ఈ పంచాయతీలో శతశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మండలంలో ఎన్ని గ్రామాల్లో సర్వే ప్రారంభమైంది, ఎంత వరకు పూర్తయ్యిందన్న వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకట రమణ, డిపిఒ రవికుమార్, తహశీల్దార్ శ్రీరాములు, ఎంపిడిఒ ఈశ్వరరావు, సచివాలయం సిబ్బందిపాల్గొన్నారు.

సర్వే వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

సముద్రంలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మనోజ్

పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలసలోని గాంధీనగర్‌కు చెందిన గొల్లపల్లి మనోజ్ (22) సముద్రంలో గల్లంతయ్యాడు. బుధవారం తన స్నేహితులతో కలిసి గార మండలం మొగదాలపాడు బీచ్‌కు విహారయాత్రకు వెళ్లినట్లు సమాచారం. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తన తోటి స్నేహితులు ఇతడు ముగ్గురు కలిసి సముద్రంలోనికి స్నానానికి దిగగా అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా స్థానిక మెరైన్ పోలీసులు గుర్తించి ఇద్దరిని కాపాడినట్లు సమాచారం. మనోజ్ సముద్రంలో కొట్టుకుపోగా ఆయన కోసం మెరైన్ పోలీసులు గాలిస్తున్నారు. దీంతో బాధితుడి నివాసం వద్ద విషాద ఛాయలు అలముకున్నాయి.

వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: మండలం జాతీయ రహదారిలో చీపుర్ల పాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నేవలసకు చెందిన బొమ్మాళి జోగారావు తీవ్రంగా గాయపడ్డాడు. కళాసిగా పని చేస్తున్న జోగారావు కన్నేవలస వెళ్లేందుకు రోడ్డు పక్కన ఆటోకు టమాటాలు లోడు చేస్తుండగా టెక్కలి నుంచి నరసన్నపేట వైపు వెలుతున్న మోటార్ సైకిల్ డీ కొనడంతో ఈ ప్రమాధం జరిగింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన జోగారావును చికిత్స కోసం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఇక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు స్థానిక హెడ్‌కానిస్టేబుల్ వివేశ్వరరావు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శిరీష పరామర్శ

పలాస : మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న శిరీష

పలాస: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతిచెందిన కాశీబుగ్గకు చెందిన శ్యామలరావు, వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామానికి చెందిన ప్రభుత్వ వైద్యులు మడే రమేష్ కుటుంబాలను బుధవారం రాత్రి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించారు. అనంతరం పలాస మండలం కంత్రగడ గ్రామానికి చెందిన ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన కద్దాల నాగేశ్వరరావు కుమారుడు అనిల్‌ను పరామర్శించారు. ఆమెతోపాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, టిడిపి రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దువ్వాడ సంతోష్‌కుమార్, కద్దాల కృష్ణారావు, సూరాడ మోహనరావు, ఉమామహేశ్వరరావు, బి.శశిభూషణ్, దుర్యోధన, చిట్టిబాబు, రామకృష్ణ, ఈశ్వరరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో టిడిపి సీనియర్ నాయకులు బల్ల రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి అవిర్భవం నుండి పార్టీలో ఉంటు పార్టీ అబివద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల ధర్మారావు, కాళ్ల జయదేవ్, నందిగాం కోటేశ్వరరావు, ఆసీ లీలారాణి, కాళ్ల దిలీప్‌కుమార్, జిలానీ, జన్నెల సంతోష, కొండ శంకర్‌రెడ్డి, అర్జున, జానికారవు, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సాయిరాజ్

సాయిరాజ్...

సోంపేట: మండలంలోని జగతి కేశపురం గ్రామానికి చెందిన పిఎసిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం తల్లి రౌతు కేశమ్మ ఇటీవల మతి చెందారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ బుధవారం విశ్వనాథం కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. కొర్లాంకు చెందిన వైసిపి సీనియర్ నాయకుడు తామాడ గణపతి అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారం తెలుసుకొని ఆయనను పరామర్శించారు. కార్యక్రమాల్లో సాయిరాజ్‌తో పాటు నాయకులు మడ్డు రాజారావు, బుద్దాన శ్రీకృష్ణ, తులసమ్మ, ఢిల్లీరావు, కోదండరావు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- మందస

తండ్రి వారసత్వం ద్వారా సంక్రమించిన ఆస్తిలో తనకు చట్టపరంగా రావాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్న తల్లి, కూతురుపై కంకరమట్టి వేసి, సామూహికంగా హతమార్చేందుకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు బి.ఆనందరావు, బి.వాసుదేవరావు, వంకల అప్పయ్య, చంద్రయ్య, భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. మందస మండలం హరిపురం గ్రామంలో నవంబర్ 7న జరిగిన ఈ సంఘటన నేపథ్యంలో బుధవారం హరిపురంలో బాధితులు కొర్ర దాలమ్మ, మజ్జి సావిత్రి, కుమారుడు ప్రవీణ్‌లను కలిసిన నాయకులు వారికి తమ సంఘీభావాన్ని తెటలిపారు. అధికార పార్టీ నాయకుడుగా చలామణి అవుతున్న రామారావుకు ప్రభుత్వ అధికారులు తమ వంతు సహాయం అందించడం వలనే, ఈ సంఘటన జరగడానికి కారణమని ఆరోపించారు. బాధితులకు చట్టపరంగా దక్కాల్సిన ఆస్తిని దఖలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని, ట్రాక్టర్‌తో కంకర మట్టి వేసి తల్లి కూతురిని చంపేందుకు పూనుకున్న నిందితుడు రామారావును కఠినంగా శిక్షించాలని, కుటుంబానికి అన్ని విధాల రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పరామర్శిస్తున్న నాయకులు

నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డు భైరిశాస్త్రులపేటకు చెందిన దళిత మహిళ బండారి మంజుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళిత జెఎసి డిమాండ్ చేసింది. దళిత జెఎసి ఆధ్వర్యాన పట్టణంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూలమాల వేసి అక్కడి నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సమతా సైనిక్‌దళ్ ఉపాధ్యక్షుడు వన్నల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బండారి మంజు అనే దళిత మహిళ పైన పక్క గ్రామానికి చెందిన గాజుల కొల్లివలస సర్పంచ్ మొండేటి కూర్మారావు భూతగాదాలో భాగంగా పెద్ద మనిషి తరహాలో వచ్చి ఆమె పైన దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన లంక ఆదినారాయణ, పవన్ కళ్యాణ్, రామరాజు, శారద బాధితురాలపై కర్రలతో దాడి చేసి కులం పేరుతో దూషించారని బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై జిల్లా డిఎస్‌పి సిహెచ్.జి.వి.ప్రసాద్ దర్యాప్తు నిర్వహించారని, కానీ, ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేదని వాపోయారు. ఇప్పటికైనా నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో దళిత జెఎసి వారి పక్షాన నిలబడి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జనసేన పార్టీకి చెందిన ఎంపిటిసి విక్రమ్, రామకృష్ణ, నీలంనాయుడు అక్కడకు చేరుకొని ఆమెకు ధైర్యం చెప్పి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బోనెల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షులు డి.గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షులు బి.ప్రభాకర్, ఎన్.గురుమూర్తి, ఎంఆర్‌పిఎస్ నాయకుడు లోపింటి నారాయణరావు, సమతా సైనిక్‌దళ్ అధ్యక్షుడు మన్నేన శంకర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కారు దగ్ధం

రణస్థలం: మండలంలోని బీరు పరిశ్రమ వద్ద కారులో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో డ్రైవర్‌తో సహా అందరూ అప్రమత్తమై దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం జిల్లా పెద్ద వాల్తేరు చెందిన కాంట్రాక్టర్ పి.గ్రహణేశ్వరరావు తన సొంత కారులో డ్రైవర్ వాసుతో కలిసి ఎచ్చెర్ల మండలంలోని స్మార్ట్ కం కంపెనీకి వస్తున్నారు. విశాఖలో బయలుదేరిన అరగంట తరువాత కారులో నుంచి వైర్లు కాలే వాసన వస్తుందని గమనించారు. కోష్ట దాటిన తరువాత ఇంజిన్‌లో నుంచి పొగ రావడంతో కారు ఆపి దిగిన వెంటనే క్షణాల్లో మంటలు చెలరేగి కారు కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో కారు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దగ్ధమవుతున్న కారు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పలాస

మండలంలోని కొత్తవూరులో కాశీబుగ్గ విద్యా వాహిని జూనియర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా జెమ్స్ ఆస్పత్రి వైద్యులు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కేన్సర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తిరుమలరావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆయుధం గిరిబాబు, జెమ్స్ ఆస్పత్రి ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు, విఆర్ఒ ప్రదీప్, పైలా మన్మథరావు, సిహెచ్ పుష్పన్న, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలు అందిస్తున్న జెమ్స్ వైద్యులు

తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు

కృష్ణ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పిస్తున్న రమణ

టెక్కలి రూరల్ : తెలుగు జాతి గర్వించదగ్గ నటుడు సూపర్ స్టార్ కృష్ణ అని, ఆయన అకాల మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని సుదర్శన థియేటర్ యజమాని సత్తారు రమణ అన్నారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెండి తెర వేల్పులుగా వెలుగొందిన ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్బాబు, కృష్ణంరాజు, కృష్ణల మతితో ఆనాటి శకం ముగిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చి నూతన ఒరవడి సష్టించిన వ్యక్తి సూపర్ స్టార్ కృష్ణ అని కొనియాడారు. అందరి మంచి కోరుకొనే అరుదైన వ్యక్తిత్వం కృష్ణ సొంతమని తెలిపారు. తెలుగు సినిమా ఉన్నంత కాలం ఆయన కీర్తి నిలిచి ఉంటుందని, సినీ పరిశ్రమ సేవల్ని కొనియాడారు సుదర్శన థియటర్ మేనేజర్ బాల ఉన్నారు.

పత్రికలు ప్రజాభిప్రాయానికి ప్రతీకలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

పత్రికలు ప్రజాభియానికి ప్రతీకలని సరుబుజ్జిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యాన జాతీయ పత్రికా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో వార్తా పత్రికలు పోషిస్తోన్న పాత్ర విలువైందన్నారు. కచ్చితమైన ప్రజాభిప్రాయాన్ని సేకరించి సమాజానికి తెలియజేయడంలో పత్రికలు ఎనలేని సేవ చేస్తున్నాయని పేర్కొన్నారు. పిఒ దగ్గివలస రాంప్రసాద్ మాట్లాడుతూ పత్రికలు చదవడం వల్ల వ్యక్తిగత అభివృద్ధి, సమాజాభివృద్ధి రెండూ సాధ్యమవుతాయని అన్నారు. వివిధ రకాల వార్తా పత్రికలను సేకరించి వాటి ఆవిర్భావం చరిత్రలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధనుంజయరావు, చిన్నారావు, లైబ్రేరియన్ రామారావు, కృష్ణమూర్తి, రమేష్ సాహూ, శ్రీనివాసరావు, విజయ, సంగీత, అప్పలనాయుడు, సరుబుజ్జిలి శాఖాగ్రంథాలయాధికారి ఉగ్రసేన్, విమల పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్ : సంఘాల నేతగా జీవితాన్ని ఆరంభించి, జర్నలిస్టుగా, న్యాయవాదిగా, వాకర్స్ సంస్థ కన్వీనర్‌గా, సామాజిక సేవకునిగా శాసపు జోగినాయుడు ఎంతో గుర్తింపు పొందారని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్ పి.జి.గుప్తా అన్నారు. జిల్లా న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాదుల ఛాంబర్‌లో జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలో భాగంగా జోగినాయుడుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాది తంగి శివప్రసాద్, ప్రభుత్వ న్యాయవాదులు వాన కృష్ణచంద్, కొమరాపు ఆఫీస్‌నాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, బార్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు జి.వాసుదేవరావు, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : పత్రికలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ కార్యాలయంలో కాశీనగర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ ప్రవాస్ కుమార్ బెహరా, కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల శాయమ్మ, రిషికేశ్ గౌడ, ప్రశాంత్ మిశ్ర, తామాడ కృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి రూ.లక్ష విరాళం

సోంపేట: పలాసపురంలో పునర్నిర్మాణం చేస్తున్న దత్తాత్రేయ ఆలయానికి జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ఆలయ అభివద్ధి కోసం ఈ విరాళం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వారితోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న జెడ్‌పిటిసి యశోద

సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

పేదలు ఆర్థిక సుస్థిరత సాధించాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పేదలు బలపడితేనే సమాజాభివృద్ధి సాధ్యమన్న సిద్ధాంతాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సుసాధ్యం చేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక 15వ వార్డు మెణింగివారివీధి, గణేష్‌నగర్ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆర్థిక సుస్థిరత నవరత్నాల సంక్షేమ పథకాలతో సాధ్యమని, దాని కోసం ముఖ్యమంత్రి దార్శనిక నిబద్ధత వెలకట్టలేనిదని కొనియాడారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, మనబడి నాడు-నేడు, పేదలందరికీ ఇళ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలతో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది, లేనిది లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.రవిసుధాకర్, ఎఇ కె.అప్పలనాయుడు, టిపిఎస్ హెచ్.వి.సత్యనారాయణ, ఆర్‌వి డి.రామారావు, హౌసింగ్, విద్యుత్‌శాఖ ఎఇలు డి.సన్యాసిరావు, జి.రామారావు, వైసిపి నాయకులు పి.కృష్ణవేణి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పరిశీలిస్తున్న మెరైన్ పోలీసులు

తీర ప్రాంతంలో నిఘా

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

తీర ప్రాంతంలో డేగ కన్నుతో నిఘా వేస్తున్నామని భావనపాడు మెరైన్ సిఐ జి.దేవుళ్లు తెలిపారు. సి విజిల్ 22 భద్రతలో భాగంగా దేవునల్తాడ కూడలిలో బుధవారం భావనపాడు తీర ప్రాంత రక్షణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోస్టల్ ఎక్సర్‌సైజ్‌ను ఆయన పర్యవేక్షించారు. తన పరిధిలో ఉన్న తీర ప్రాంత మండలాలైన వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో సుమారు 80కిలోమీటర్ల మేర విస్తరించిన తీర ప్రాంత గ్రామాల్లో సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా నిఘా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వాహనాలను తనిఖీ చేయడంతో పాటు సముద్ర తీరంలో గస్తీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని దేవునల్తాడ, మంచినీళ్లపేట, కొత్తపేట, అక్కుపల్లి సముద్ర తీరాల్లో సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశామని తెలిపారు.

భావనపాడు తీరంలో సాగర కవచ్

నౌపడ: సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో మెరైన్ సిఐ దేవుళ్లు ఆధ్వర్యంలో సాగర్ కవచ్ కార్యక్రమం నిర్వహించారు. దేశ తీర ప్రాంత రక్షణ చర్యల్లో భాగంగా నిర్వహిస్తున్న సి విజిల్ 2022 సాగర్ కవచ్ 15,16 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించామని సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ నేవీ, ఆక్టోపస్, సిఐఎస్ఎఫ్, ఇండియన్ కోస్ట్‌గార్డ్, ఎపి మెరైన్ పోలీసులు, సివిల్ పోలీసులు, మత్స్యశాఖ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. చొరబాటుదారులను ఎలా గుర్తించాలి, వారిని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వారిపై దాడులకు దిగకుండా స్థానిక పోలీసులకు గానీ మెరైన్ పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని మత్స్యకారులకు తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. మెరైన్ ఎస్ఐ బాలకృష్ణ, మహాలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ముఖాల్లో వెలుగు చూడాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

శంకుస్థాపన చేస్తున్న విజయ

ప్రజాశక్తి - కవిటి

రైతుల ముఖాల్లో వెలుగు చూడాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఆకాంక్షించారు. నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా రూ.64లక్షలతో మండలంలోని రామయ్యపుట్టుగ, గొండ్యాలపుట్టుగ, కవిటి బెహరా వీధి, కొత్తపాలెం గ్రామాల్లో అంగన్వాడీ భవనాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఉద్యానవన శాఖ ఎంఐడిహెచ్ నిధులతో కొబ్బరి రైతుల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయ సమీపంలో రూ.30 లక్షలతో రెండు కలెక్షన్ సెంటర్లకు శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. రైతుల కష్టసుఖాలు గుర్తించి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి మాధవీలత మాట్లాడుతూ ఒక్కో యూనిట్ రూ.15లక్షలు కలిగిన ఈ కలెక్షన్ సెంటర్లకు రైతు సంఘం ద్వారా అయితే 75శాతం రాయితీ, వ్యక్తిగతంగా అయితే 40 శాతం రాయితీ అందిస్తున్నట్టు తెలిపారు. ఉద్యానవన, వ్యవసాయ పంటలు నిల్వచేసుకుని, మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ కలెక్షన్ సెంటర్లు ఎంతో అవసరమని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఉత్పత్తులు నిల్వచేసుకుని మార్కెటింగ్ చేసుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, నరేష్ కుమార్ అగర్వాల్, పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, రెడ్డిక జెసిఎస్ కార్యదర్శి బర్ల నాగభూషణం, పులకల శ్రీరాములు, బెందాలం జయప్రకాష్, పండి దేవేంద్రమూర్తి, పూడి నీలాచలం, కొబ్బరి, మత్స్యకార రైతు సంఘాల అధ్యక్షులు బల్లెడ జయప్రకాష్, కాయ భీమ సేన్, ఎండిఓ పి సూర్యనారాయణ, ఎంఇఓ ధనుంజయ మజ్జి, ఎపిఎం గోవింద్, మండలంలోని అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అహింసతోనే మహిళా సాధికారత

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహిళలు ఒంటరిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో తిరగగలిగి హింసాత్మక ఘటనలు నిరోధించగలిగితే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని జిల్లా న్యాయ సేవాధికారత సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. నగరంలోని సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ, (సికింద్రాబాద్) ఆధ్వర్యాన నగరంలోని వరం రెసిడెన్సీలో మహిళా సాధికారతపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించాలంటే స్త్రీ, పురుషులు ఇద్దరూ సమాన బాధ్యత కలిగి ఉండాలన్నారు, సమాజంలో నేరప్రవృత్తి తగ్గాలంటే మార్పు ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. మహిళా మార్గదర్శి సిఇఒ లక్ష్మీకుమారి మాట్లాడుతూ మహిళలపై హింస తగ్గితేనే మహిళా సాధికారత సాధ్యమన్నారు, సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ ప్రాజెక్టు ఆఫీసర్ వైశాలి మాట్లాడుతూ సంబంధిత ప్రభుత్వశాఖలు సమన్వయంతో వ్యవహరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు కృషి చేయాలన్నారు. దిశ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ లలిత మాట్లాడుతూ మార్పు కుటుంబం నుంచే మొదలు కావాలని సూచించారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐసిడిఎస్ అర్బన్ సిడిపిఒ శోభారాణి మాట్లాడుతూ కుటుంబ హింస తగ్గాలంటే ఇంట్లో మహిళలకు గౌరవం ఇవ్వాలన్నారు. అనంతరం మహిళలపై హింసపై అవగాహన కల్పించేందుకు సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వన్‌స్టాఫ్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హిమబిందు, ఎస్ఐ రేణుక, అడ్వకేట్ మోహనరావు, ఐసిపిఎస్ లక్ష్మణరావు, గీత, సిడబ్ల్యుఎస్ నుంచి చిన్ని, మహిళా మార్గదర్శి డైరెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది మీనా, సుశీల, సుమశ్రీ, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కోర్సులతో ఉపాధి

సెంచూరియన్ వర్సిటీ మేనేజరు ఫల్గుణరావు

అవగాహన కల్పిస్తున్న ఫల్గుణరావు

ప్రజాశక్తి - నరసన్నపేట

యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందించడంలో ముందంజలో నిలుస్తున్న విభాగం అగ్రికల్చర్ అని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ విభాగంలోనూ మార్పులు వస్తున్నాయని సెంచూరియన్ యునివర్సిటీ మేనేజర్ ఎస్.ఫల్గుణరావు అన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ సౌజన్యంతో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో బుధవారం కెరీర్ గైడెన్స్‌పై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేనేజరు మాట్లాడుతూ అగ్రికల్చర్‌లో బ్యాచ్‌లర్ నుంచి పిహెచ్‌డి వరకు ఆయా కోర్సులకు తగ్గట్టుగా అభ్యర్థులకు అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయన్నారు. బ్యాచిలర్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి వ్యవసాయ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, ఉద్యానశాఖ అధికారులు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు వంటి ఉద్యోగాల్లో నియామకం జరుగుతుందన్నారు. ఇవి కాక ప్రైవేట్ కంపెనీల్లో ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, న్యూట్రియంట్ సూపర్‌వైజర్స్, ల్యాబ్ ఇన్‌ఛార్జి వంటి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీటితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, సెంచూరియన్ వర్సిటీ ప్రతినిధి శ్రీనివాస్ పాణిగ్రాహి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యేతర కార్యక్రమాలపై శిక్షణ

ప్రజాశక్తి - కంచిలి

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే విద్యేతర పనుల నిర్వహణపై వెలుగు సిఎఫ్‌లకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్నం భోజనం పథకం, అమ్మఒడి, పుస్తకాల పంపిణీ, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఎం.పార్వతి, ఎంపిడిఒ చల్ల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ రాము, సిఆర్‌పిలు చంద్రశేఖర్, ఢిల్లీరావు, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

నాడు-నేడుపై సమీక్ష

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మనబడి నాడు-నేడులో భాగంగా ప్రభుత్వం పాఠశాలల్లో చేపడుతున్న పనులపై బుధవారం సమీక్షించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంఇఒ అప్పారావు, మండల విద్యా సంక్షేమ అధికారి ప్రసాదరావు అధ్వర్యంలో అవగాహన కల్పించారు. అకాడమిక్, నాన్ అకాడమిక్ అంశాలపై తగిన దృష్టి పెట్టి పాఠశాలలో విద్యను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎస్.ప్రసాదరావు అన్నారు. గోరుముద్ద, పారిశుధ్యం, అమ్మఒడి, ఇతర ముఖ్యమైన పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 55 మంది ఈచ్‌ఎంలు, సిఆర్‌పిలు, పాల్గొన్నారు.

నేటి నుంచి వర్క్‌షాప్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి మూడు రోజుల పాటు లెక్చరర్ల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో బుధవారం బ్రోచరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్సెస్ అకాడమీస్ సౌజన్యంతో న్యూ ఫ్రాంటియర్స్ ఇన్ కెమికల్ సైన్సెస్ అనే అంశంపై మూడు రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో పలు విశ్వవిద్యాలయాల నుంచి నిష్ణాతులైన ఆచార్యులు పాల్గొనే అరుదైన వర్క్‌షాప్ అని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌కు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొవాలని అన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి డి.ఆదినారాయణ, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రామకృష్ణలు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కెమిస్ట్రీ (రసాయన శాస్త్రం)లో నిర్వహించిన వివిధ విభాగాలకు సంబంధించి శాస్త్రసాంకేతిక పరిశోధనలపై అనుభవజ్ఞులైన ఆచార్యుల ఉపన్యాసాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర అధ్యాపకులు, సైన్స్ విభాగాలకు సంబంధించిన అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

'మధ్యాహ్న భోజనం' పరిశీలన

ఆమదాలవలస : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో జగనన్న గోరుముద్ద పథకం పేరుతో ఉచితంగా మధ్యాహ్నం భోజన సదుపాయం ప్రభుత్వం కల్పిస్తుందని మండల విద్యా సంక్షేమ అధికారి, ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని కొర్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పంపిణీ చేసిన కూరగాయలు, అన్నం కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చెక్కి పంపిణీని పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని వంట కార్మికులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదువుకోడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.దేవరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న నేతాజీ

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

ఆమదాలవలస : పట్టణంలోని గేటులో ఉన్న మున్సిపల్ హైస్కూల్లోని ఉత్తమ విద్యార్థినీ విద్యార్థులకు జీవిత బీమా సంస్థ ఆధ్వర్యాన స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జీవిత బీమా బ్రాంచ్ మేనేజర్ ఎం.నేతాజీ మాట్లాడుతూ విద్యార్థులు టీం వర్క్‌తో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. నిరుపేద విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించినట్లయితే జీవిత బీమా సంస్థ తన గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ద్వారా వారు ఉన్నత విద్యను అభ్యసించడానికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బోర కుమారస్వామి, ఉపాధ్యాయులు రవణమ్మ పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

బూర్జ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆముదాలవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మామిడివలస ఎంపిటిసి సభ్యులు గుమ్మడి రాంబాబు అన్నారు. మండలంలోని తోటవాడ పంచాయతీ పరిధిలో ఉన్న రాజుపేటలో నూతన తాగునీటి బోరును ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజుపేటకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంక్‌తో పాటు ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు శాసనసభ స్పీకర్ సీతారాం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. త్వరలో పనులకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరావు, ఎంపిటిసి సుధాకర్, ఉప సర్పంచ్ వెంకటరమణ, శివాజీశంకర్, జగదీష్, రాజేష్ పాల్గొన్నారు.

ఎంపీ అవినాష్‌ను కలిసిన 'లోతుగెడ్డ'



మాట్లాడుతున్న తులసీ వరప్రసాదరావు

కొత్తూరు : కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని పాతపట్నం నియోజకవర్గ వైసిపి నాయకు లు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈయన వెంట కొయిలాపు సంజీవరావు ఉన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

కోటబొమ్మాళి: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా ప్రతి ఒక్క విద్యార్థి నమోదు చేసుకోవాలని తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ అన్నారు. బుధవారం స్థానిక వంశధార డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు కోసం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అమె మాట్లాడుతూ డిగ్రీ చదివిన ప్రతి విద్యార్థీ ఓటు హక్కును ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా, లేక దరఖాస్తును మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అందజేయాలన్నారు. కార్యక్రమంలో వంశధార విద్యాసంస్థల చైర్మన్ చింతాడ అనిరుద్రుడు, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.మధు, కె.రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ఈశ్వరమ్మ

సంక్షిప్త వార్తలు

నేడు వికేంద్రీకరణకు మద్దతుగా ర్యాలీ

టెక్కలి రూరల్ : వికేంద్రీకరణకు మద్దతుగా జెఎసి ఆధ్వర్యాన గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జెఎసి కన్వీనరు స్టాలిన్ తెలిపారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం వారు ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ నిర్ణయంతో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలు రూపురేఖలు మారిపోతాయని, వలసల నివారణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించడం జరుగుతుందని తెలిపారు. ర్యాలీలో అన్ని రాజకీయ పార్టీలు, ఎన్‌జిఒలు, కార్మిక సంఘాలు, మీడియా, వృత్తిదారులు పాల్గొనాలని కోరారు.

రోల్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

సోంపేట: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి రోల్ బాల్ పోటీల్లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ తెలిపారు. బుధవారం పాఠశాలలో క్రీడల్లో పా ల్గొన్న విద్యార్థులు బి.కార్తికేయసాయి, బి.గౌతమ్, బి.తులసిరామ్, డి.కౌశిక్‌లను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్‌జె.మారావ్, కోచ్ చంద్రావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోటలో గురువారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని ఎఇ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌టి కండక్టరు మరమ్మతుకు గురి కావడంతో నూతన కండక్టరు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ఇచ్ఛాపురం: జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు, చాగంటి సత్సంగం విశాఖపట్నం సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ జరిగింది. ఉత్తమ ఫలితాల సాధన కోసం, అత్యధిక సంఖ్యలో ట్రిపుల్ ఐటిలో స్థానాలు సాధించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదాద్దలన్న ఉద్దేశంతో ఉచితంగా అల్‌ఇన్‌ఒన్ పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సింహాచలం, ఎంఇఒ అప్పారావు ఎమ్మార్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

లావేరు : మండలంలోని గుంటుకుపేటలో వైసిపి నాయకులు పరసయ్య తల్లి, ఉప సర్పంచ్ కూనపు పోలీసు అమ్మమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట జెడ్‌పిటిసి మీసాల సీతం నాయుడు, కలిశెట్టి భాస్కరరావు, లంక రామునాయుడు, మీసాల వెంకటఅప్పలనాయుడు ఉన్నారు.

నాలుగు వేల మందికి అన్నదానం

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురంలో అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం పడిపూజ సందర్భంగా నాలుగు వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాళ్లపేట కృష్ణారావు, కె.నారాయణస్వామి, గుంట శ్రీనివాస్, గుంట సత్యం, పిగోవింద, శివ, అయ్యప్ప స్వాములు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక అయ్యప్ప ఆలయంలో పడి పూజ కనులపండువగా జరిగింది. 18 రకాల అభిషేకాల అనంతరం మధ్యాహ్నం అయ్యప్ప స్వామిని తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, మహిళలు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

కంచిలి: మండలంలోని పెద్ద కొజ్జారియాలో బుధవారం టిడిపి మండల కార్యదర్శి మాదిన రామారావు బోరు పనులను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ.2 లక్షలతో బోరు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కృష్ణకుమార్, బొడ్డ కిరణ్, బొడ్డ హరిబాబు, మాదిన ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

టెక్కలి: పాతనౌపడా పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు మొదటి ప్రాధాన్యత కల్పించనున్నామని సర్పంచ్ దల్లి సంధ్యారాణి తెలిపారు. బుధవారం గ్రామంలో ఇంటింటికీ కుళాయి నీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య నివారణ చర్యలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి లోకేశ్వరరెడ్డి, ఎంపిటిసి సుగ్గు అప్పలరెడ్డి, పాత నౌపడా గ్రామ సచివాలయ డిడిఒ పేడాడ సోమేశ్వరరావు, చెంచు లక్ష్మి, గౌడు శ్రీనివాస్, తిరుపతి, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి

పలాస: త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారులు, కాంట్రాక్టర్లు ఆదేశించారు. పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడు రహదారి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత పని జరిగింది, ఇంకా ఎంత పని చేయాల్సి ఉంది, రోడ్డు పనులు చేపట్టే సమయంలో తప్పని సరిగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, కో-ఆప్షన్ సభ్యులు రొనంకి శ్రీనివాసరావు, మున్సిపల్ డిఇఇ బళ్ల హరి, ఎఇఇ అవినాష్, వైసిపి నాయకులు ధనుంజయ, రోడ్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మెప్మా అధికారులకు సూచించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేయడంతో పాటు సక్రమంగా తిరిగి చెల్లించే విధంగా మెప్మా అధికారులు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో టిఎంసి భాస్కరరావు, సిఓ స్వప్న, సిఎల్‌ఆర్పిలు, ఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న పూడి వినీల జాతీయ స్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ బుధవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి ఈ నెలాఖరు వరకు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వినీల పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆమెకు అభయం యువజన సేవా సంఘం రూ.2వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వినీలను బెవర సతీష్‌కుమార్, లూక్‌పాల్, పీడీ సత్యనారాయణ, రామారావు, కె.శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న గోవిందమ్మ

రూ.20 వేలు ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: వెన్నుపూస విరిగి విపత్కర పరిస్థితుల్లో ఉన్న ఉత్తరమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం యువతరం సేవా సమితి ముందు కొచ్చింది. బుధవారం సేవా సంస్థ సభ్యులు సంతబొమ్మాళి మండలం శివరాంపురం గ్రామం చేరుకొని మంచంపై ఉన్న ఉత్తరమ్మ ఇంటికి వెళ్లి పరిస్థితి తెలుసుకొని సంస్థ నుంచి 20 వేల రూపాయలు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యువతరం గౌరవ వ్యవస్థాపకులు చింత మురళి, కార్యదర్శి గొరకల అశోక్, విగ్నేష్, సభ్యులు బత్తిని లక్ష్మణరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన అవసరం

పౌరసరఫరాల శాఖ ఎఎంటి సృజన

మాట్లాడుతున్న సృజన

ప్రజాశక్తి - జలుమూరు

ధాన్యం కొనుగోలుపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని పౌరసరఫరాల శాఖ ఎఎంటి(అసిస్టెంట్ మేనేజర్, టెక్నికల్) సృజన అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం విఆర్‌ఒలు, విఎఎ, టిఎ, కొనుగోలు ఏజెన్సీలు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో మిల్లర్లకు, రైతుకు ఎటువంటి సంబంధం ఉండకూడదని అన్నారు. దీనిపై గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు ప్రభుత్వ మద్దతుధరను పొందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ జివి.రవికుమార్, ఎఒ సురేష్, డిఎస్‌డిటి పి.గణేష్, ఆర్‌ఐలు సతీష్, శ్రీనివాస్, ధాన్యం కొనుగోలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాస్మిన్ కుమారి

వికలాంగుల చట్టంతో పూర్తి రక్షణ

ఇచ్ఛాపురం: వికలాంగుల చట్టంతో వారికి పూర్తిగా రక్షణ కల్పిస్తుందని న్యాయవాది ప్రేమలత పట్నాయక్, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ జాస్మిన్‌కుమారి తెలిపారు. చైల్డ్‌లైన్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం భవిత కేంద్రంలో వికలాంగులకు చట్టాలపై అవగాహన కల్పించారు. 6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు, శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ఉచిత విద్యా కోర్సులు కల్పించడమే కాకుండా వారికి ప్రయోజనాలు చేకూర్చడం ఈ చట్టం ఉద్దేశమన్నారు. కారక్రమంలో ఈచ్‌ఎంలు సూర్యం, రాధ, అధ్యాపక బృందం గీత, రాణి, ఉషారాణి, భాగ్యలక్ష్మి, అరుణ, శంకరరావు, చైల్డ్‌లైన్ సిబ్బంది, ఝాన్సి, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రలో బ్రెడ్స్ సంస్థ ఆధ్వర్యాన బాలల దినోత్సవం సందర్భంగా చైల్డ్ లైన్ దోస్తీ పోస్టర్‌ను ఎస్ఐ రాజేష్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ జి.జగన్నాథం, మండలస్థాయి కో-ఆర్డినేటర్‌లు ఎం.పోలయ్య, పాతపట్నం, హిరమండలంకో-ఆర్డినేటర్ జి.విజయ, వనజ, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: చైల్డ్‌లైన్ వారోత్సవాల్లో భాగంగా టెక్కలి జూనియర్ కళాశాలలో చైల్డ్ లైన్ సె దోస్తీ పోస్టర్‌ను ప్రిన్సిపాల్ జనార్ధనరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కె.శివాజీ, డి.రమ, డి.జగదీశ్వరీ, కె.సునీత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.